# శివరాత్రి - బోధరాత్రి - జ్ఞానరాత్రి

**"శివు కల్యాణే"** అను ధాతువుతో శివ పదం తయారౌతుంది. కల్యాణ స్వరూపుడు, కల్యాణకారి యగుటచే పరమేశ్వరునకు శివుడని పేరు. కల్యాణకారుడనగా మేలు చేయువాడని అర్థం. పరమేశ్వరుడు సదా జీవులందరికి మేలు చేయుచుండును. జీవుల మేలుకొరకు సూక్ష్మరూపంలో విడివడి పరమాణువులుగా ఉన్న ప్రకృతిని పరమేశ్వరుడు తన అనంత జ్ఞాన సామర్థ్యాలతో అత్యంత రమణీయంగా విజ్ఞానయుక్తంగా మలచి యీ సృష్టిని గావించెను. బహు ప్రజ్ఞతో ప్రాణుల శరీరాలను నిర్మించి జీవులు భోగించుటకై ఇంద్రియాలను, మనస్సును నిర్మించి యిచ్చెను. అందు ఉత్తమ ప్రాణిగా మానవ శరీరాన్ని నిర్మించెను. వికసించిన యింద్రియాలతో, వికసించిన బుద్ధితో నిర్మింపబడిన మన ఈ మానవ శరీరాలు పరమేశ్వరుని రచనయే. తన అద్భుత సృష్టి వలన మానవులు మరింత ప్రయోజనం పొందుటకై సృష్టి రహస్యాల నన్నింటిని వేదం ద్వారా ఉపదేశించెను. అలసిన శరీర మనస్సులను నిద్రపుచ్చి నవచైతన్యాన్ని ప్రసాదించును. అనన్య భక్తితో సేవించేవారికి దివ్యానందము నొసగును. తీవ్ర వైరాగ్యం బొందినవారిని శరీర బంధం నుండి, జనన మరణాల నుండి విముక్తుల జేసి కోట్ల సంవత్సరాలు తన తృతీయ ధామంలో ఆనంద డోళికల నోలలాడించును. కనుక సర్వ వ్యాపకుడైన ఆ పరమేశ్వరునకే శివుడను సార్థక నామధేయం గలదు.

ఆ శివునకు ఈశుడు, ఈశ్వరుడు, పరమేశ్వరుడు, శంకరుడు, మహాదేవుడు, రుద్రుడు మొదలగు పేర్లు కూడా గలవు. ఈ నామములన్నియు అతని గుణ కర్మములు తెలుపునట్టివే.

పరమేశ్వరుడు తన అద్భుత సామర్థ్యంతో పరమాణువులలో అణుబంధనాన్ని (Chemical Bond) యేర్పరచి వివిధ పదార్థాలను సృజించెను. కొన్ని ప్రకృతి సూత్రాల (Physical Laws) తో గ్రహగోళాలను బంధించి వాటిని నియమబద్ధంగా నడుపుచు అందు వసించు ప్రాణుల జీవన యాత్రలను పరిరక్షించుచుండును.

కనుక పరమేశ్వరునకు **'ఈశుడు'** (ఈశ–నియమనే) నియామకుడు అను పేరు కలిగినది. మనము కష్టించి సంపాదించి నిర్మించిన వస్తువులు మన ఐశ్వర్య మగును. అట్లే పరమేశ్వర నిర్మితమైన యీ బ్రహ్మాండము, అందలి సమస్త పదార్థములు అతని ఐశ్వర్యమగును. అందుచే భగవంతునకు (ఇది–ఐశ్వర్యే) **'ఈశ్వరుడని** పేరు'. అతని ఐశ్వర్యము శ్రేష్ఠమైనదనియు, గొప్పదియు నగుటచే **'పరమేశ్వరు'డని** మరియొక పేరు. జీవులందరకు శం – సుఖమును కలుగజేయువాడు గనుక ఈశ్వరునకు **'శంకరు'**డని పేరు. దివ్య గుణములు గలిగిన జడ చేతన దేవతలలో గొప్పవాడుగా ప్రకాశించును గనుక పరమేశ్వరునకు **'మహాదేవు'**డని పేరు కలిగినది. ఆ శివుడు జీవుల అంతర్యామియై పాపకార్యాలొనర్చు నపుడు భయాందోళనలను కలిగించి దుఃఖములపాలు గాకుండా హెచ్చరించుచుండును. ఆ అంతర్యామి ప్రేరణను లెక్కచేయక పాపము లొనర్చిన బాగుపడవలెనను దృష్టితో తల్లివలె దండించి (కష్టముల నిచ్చి) మంచి మార్గమున నడుపుటకు యత్నించును. ఇంకను వినకున్న రుద్రుడై శిక్షించి సంస్కరించును. అందుచేతనే పరమేశ్వరునకు (రుద – రోదనే) **'రుద్రు'** డని మరియొక పేరు.

ఇవియన్నియు శివ నామములే. అత డనంత సామర్థ్య యుక్తుడగుటచే అతని పేర్లును అనంతములుగానే యుండును. అందు ముఖ్యమైన 108 పేర్లను వేదము పేర్కొనును. పొరబడకుండుటకు అవియన్నియు ఏకేశ్వరుడైన పరమేశ్వరునివే **'ఏకం సద్విప్రా బహుధా వదన్తి'** (ఋ. 1–164–49) యని వేదము చెప్పును.

భగవంతుని ఈ నామము లన్నియు యౌగికములే. అనగా మూల ధాత్వర్థమునే ప్రకటించును. ఆ శివునకే బ్రహ్మ, విష్ణువు, గణపతి మొదలగు పేర్లు కూడా గలవు. బ్రహ్మ యనగా అన్నిటికన్న గొప్పవాడు. విష్ణు వనగా (విశ్లృ – వ్యాప్తౌ) అంతట వ్యాపించి యుండువాడు. గణపతి యనగా (గణ – సంఖ్యానే) లెక్కించ వీలైన జీవ గణములకు అధిపతి. కాని, నేడు పురాణాల ప్రభావం వలన, తదనుగుణంగా వ్రాసిన కవిత్వాలు, పాటలు, నాటికలు, కథలు మొదలగు వానివలన, వాటికి రూపమిచ్చుటకు రవి వర్మాదులు వేసిన చిత్రపటాల వలన, నిర్మించిన దేవాలయాల వలన, ఆ పంథాలోనే నడచుచున్న నాటకాలు, సినిమాల వలన పరమేశ్వరుని ఒక్కొక్క నామమునకు ఒక్కొక్క రూపము, ఒక్కొక్క

చరిత్ర మన మనస్సులో స్ఫురించుచుండును. గాని ఈశ్వరుడు ఒక్కడే. అతడు సర్వవ్యాపకుడు, నిరాకారుడు.

అట్టి ఈశ్వరునకు ప్రతిమను (లింగమును) ఏర్పరచి అభిషేకాది షోడశోపచార పూజలెందుకు? శివరాత్రి ఉపవాస జాగరణ లెందుకు? అట్టి పూజల వలన ఎందరికి జ్ఞానోదయమైనది? ఎవరికి జ్ఞానోదయమైననూ కాకున్ననూ మహర్షి దయానందునకు శివరాత్రి రోజుననే వివేకబోధ కలిగినది. శివరాత్రి దినమున కొన్ని ఎలుకలు శివలింగముపైకెక్కి ప్రసాదము నారగించుచు, గంతులు వేయుచు, మల మూత్రములను విడుచుట చూచిన దయానందుడు ఈ లింగము నిజమైన శివుడు కాడని తెలుసుకొని, నిజమైన శివదర్శనము కొఱకు యిల్లు వదలి వెడలెను. ఎందరెందరో యోగులను కలుసుకొని ఎన్నెన్నో తపముల నాచరించి సమాధి నిష్ఠుడై సర్వవ్యాపక శివుని దర్శించెను. మరుగున పడిన ఆ శివజ్ఞానమైన వేదాలను వెలుగులోనికి తెచ్చి ప్రపంచమునకు మహోపకారము చేసెను. ఆర్య సమాజాన్ని స్థాపించి స్త్రీ శూద్రులకును వేదజ్ఞానము నందించెను. అందుచేతనే ఆర్య సమాజీయులు శివరాత్రిని బోధరాత్రిగా జరుపుకొందురు. మీరంతా ఈ బోధరాత్రి ఉత్సవములో పాల్గొని నిజమైన శివదర్శనము చేయించగల అద్భుత వేదజ్ఞానము నందుకొనుడు.

## వేదోక్త పరమేశ్వర స్వరూపము

**1. ఈశ్వరుడు సర్వవ్యాపకుడు, నిరాకారుడు :**

**'ఈశావాస్య మిదం సర్వం యత్కించ జగత్యాం జగత్'**

- యజుర్వేదం 40-1

ఈ చలాయమాన జగత్తంతయు అణువు మొదలు బ్రహ్మాండము వరకు ఈశునిచే (పరమేశ్వరునిచే) వ్యాప్తమై యున్నది. (గాన అతనికి ఆకారము ఉ ండదు.)

**స పర్యగా చ్ఛుక్ర మకాయ మవ్రణ మస్నావిరం శుద్ధ**
**మపాపవిద్ధమ్।**
**కవి ర్మనీషీ పరిభూః స్వయంభూ ర్యాథా తథ్యతోఽ_ర్థాన్,**
**వ్యదధాచ్ఛాశ్వతీభ్యః సమాభ్యః ॥** - యజుర్వేదం 40-8

ఈశ్వరుడు సర్వవ్యాపకుడు, సర్వశక్తిమంతుడు, స్థూల–సూక్ష్మ–కారణ శరీర రహితుడు, వ్రణములు - ఛిద్రములు - లోపములు లేనవాడు. స్నాయుబంధనములోనికి (జన్మలలోనికి) రానివాడు. పవిత్రుడు, సర్వపాపరహితుడు. వేద రచయిత. మనస్సులన్నిటికి సాక్షి. దుష్టులందరిని సంహరించగలవాడు. స్వయంభువుడు. అట్టి ఈశ్వరుడే తనవలె నిత్యులై అల్పజ్ఞులు, అల్పశక్తి సామర్థ్యములు గల జీవుల కొఱకు ఈ ప్రపంచ పదార్థముల నన్నిటిని యథాతథముగా (ఎట్లు ఉండవలెనో అట్లు) నిర్మించెను.

**2. ఈశ్వరునకు ప్రతిమ (విగ్రహము) లేదు :**

**న తస్య ప్రతిమా అస్తి, యస్య నామ మహద్యశః ।**
**హిరణ్యగర్భ ఇత్యేష, మా మా హింసీ దిత్యేషా, యస్మాన్న జాత**
**ఇత్యేషః ॥** – యజుర్వేదం 32–3

ఏ పరమేశ్వరునకు గొప్ప యశస్వంతమైన విఖ్యాతి గలదో అతనికి ప్రతిమ – విగ్రహము లేదు. ఏలనన అతడు హిరణ్యగర్భుడు – ప్రకాశ అప్రకాశవంతమైన ఈ సమస్త బ్రహ్మాండమును తనలో గర్భముగా ధరించియున్నవాడు. అతని వేదాజ్ఞలను హింసించవద్దు - తిరస్కరించవద్దు. అతడు జన్మించడు - అవతారములనెత్తడు. అట్టి సర్వవ్యాపకుడు నీలో అంతర్యామియై అతి సమీపమున నున్నాడు. అతనినే ఉపాసించి దివ్యానందము నొందుము.

**3. ఈశ్వరుడొక్కడే - అనేకులు లేరు :**

**న ద్వితీయో న తృతీయ శ్చతుర్థోనాప్యుచ్యతే**
**న పంచమో న షష్ఠః సప్తమో నాప్యుచ్యతే**
**నాష్ఠమో న నవమో దశమో నాప్యుచ్యతే**
**స ఏష ఏకవృదేక ఏవ ॥**– అథర్వవేదం 13–4–16, 17, 18, 20

**నమః శివాయ చ శివతరాయ చ ॥**

# శివరాత్రి

## ఋషిబోధోత్సవము

మాఘ బ 14 చతుర్దశి శివరాత్రి పండుగగా నెంచబడును. పౌరాణికులు నాడు పగలు ఉపవసించి సాయం శివమందిరములను జేరి, శివపూజలు

చేయుదురు. ఆర్య సామాజికులకు ఆ పూజలతో నెట్టి సంబంధము లేదు. శ్రీమద్దయానంద స్వామి బాల్యమున తండ్రితో శివరాత్రినాడు పగలు ఉపవాసము చేసి సాయంకాలము శివాలయమునకు వెళ్ళి తండ్రి చెప్పినట్లు పూజలొనర్చి, శివుని దర్శనము కొఱకు నిరీక్షించి దర్శనము కాకపోవుటచే శివలింగాదులు శివుడు కాదనియు, నిజమైన శివుని దర్శనము వలన మనుజుడు ముక్తిని బొందగలడని యాతడు తెలిసికొనెను. అట్టి బోధ దయానందునకు కలుగుటవలనను, పౌరాణికులు భావించు శివరాత్రి నిమిత్తముగా నిజమైన శివుని సాక్షాత్కారము కొరకు యోగాభ్యాసాదుల నొనర్చి శివుని సాక్షాత్కారము చేసికొని సిద్ధుడైనందున శివరాత్రిని సామాజికులు బోధకజనక శివరాత్రిగా స్మరించి, నాడు తమ గృహములందు సామాన్య అగ్నిహోత్రము చేసికొందురు. శివరాత్రి నెపముతో దయానంద స్వామి దృష్టికోణముతో వేదధర్మ ప్రచారము చేయుదురు.

**ఓం నమః శంభవాయచ మయోభ వాయచ,**
**నమః శంకరాయచ మయచ,**
**నమః శివాయచ శివతరాయ స్వాహా॥**

విశేష హోమం యజుర్వేదంలోని నమక చమకాలతో ఆహుతులు.